5న జీసీసీ కాన్‌క్లేవ్‌-2025

రాయదుర్గం: రాష్ట్రంలో గ్లోబల్‌ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) అభివృద్ధి కోసం చర్చించేందుకు ఈనెల 5వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంలోని షెరటాన్‌ హోటల్‌లో ఈ జీసీసీ కాన్‌క్లేవ్‌-2025ను నిర్వహిస్తున్నట్లు మూవ్‌ ఇన్‌ సింగ్‌ సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపేశ్‌అగర్వాల్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌, హ్యూమనైజ్‌ ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ జగదీశ్‌మిత్ర, ప్రముఖ వ్యాపారులు, అధికారులు ప్యానల్‌ చర్చలో పాల్గొంటారని ఆయన వివరించారు.

పాఠశాల వార్షికోత్సవం

గచ్చిబౌలి: మసీద్‌బండ బచ్‌పన్‌ హైట్స్‌ స్కూల్‌ వార్షికోత్సవం సందడిగా జరిగింది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరిగిన వార్షికోత్సవంలో చిన్నారులు వివిధ రకాల నృత్యాలు చేశారు. సందేశాత్మక నాటికలు ప్రదర్శించారు. బచ్‌పన్‌ స్కూల్స్‌ రీజనల్‌ డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శేషారెడ్డి, విద్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించండి



నానక్‌రాంగూడ రేషన్‌షాప్‌ గల్లీలో..

రాయదుర్గం: బస్తీలలో చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్‌ గల్లీలో అంతర్గత రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో చుట్టుపక్కల నివాసముండేవారు, అంతర్గతరోడ్డుపై రాకపోకలు సాగించేవారు, రేషన్‌షాప్‌కు వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన ప్రగతినగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని ప్రగతినగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యవర్గం సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే గాంధీ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ప్రగతినగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన అధ్యక్షులు బైపోతు తిరుపతిరావు, జనరల్‌ సెక్రటరీ విజయ్‌కుమార్‌, జాయింట్‌ సెక్రటరి ప్రేమ్‌రాజు, ట్రెజరర్‌ శివాల రాము, ఎండి ఇబ్రహీం, ఆస్‌బెస్టాస్‌ కాలనీ అధ్యక్షులు నరేష్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

నల్లగండ్ల చెరువును పరిశీలించిన మేయర్‌



నల్లగండ్ల నవోదయ కాలనీవాసులతో మాట్లాడుతున్న మేయర్‌ విజయలక్ష్మీ తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌ పరిధిలోని నల్లగండ్ల చెరువు, నవోదయ కాలనీలను మేయర్‌ గద్వాల విజయలక్ష్మీ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. నల్లగండ్ల చెరువులో గుర్రపు డెక్క, మురుగుతో దోమలు తీవ్రంగా ఉన్నాయని స్థానికుల ఫిర్యాదుతో మేయర్‌ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ చెరువులో వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎస్‌ఆర్‌ పద్ధతిలో చెరువును అభివృద్ధి చేస్తున్న సంస్థతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా నవోదయ కాలనీ నుంచి వెలువడే సీవరేజ్‌, సెంట్రల్‌ యూనివర్సిటీ నుంచి వచ్చే వరద నివారణకు చేపట్టనున్న విధానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌ పి.ముకుంద్‌రెడ్డి, సీఈ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఈ శంకర్‌ నాయక్‌ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రుణమేళా

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలో స్వచ్ఛ ఉద్యం యోజన ద్వారా పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ కార్మికులకు ఆటోలు ,సెప్టిక్‌ ట్యాంకులు జేసీబీలు.. ఇతర వాహనాలకు 50 శాతం సబ్సిడీపై రుణాలిచ్చేందుకు సోమవారం రుణమేళాను నిర్వహించారు. కార్యక్రమంలో స్కీమ్‌ సాత్‌ ఇండియా ఇన్‌చార్జి కె.సహదేవయ్య, ఎన్‌.చిన్నకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ కమిషనర్‌ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ లచ్చిరాం, స్టేట్‌ కో ఆర్డినేటర్‌ మల్లేష్‌రాజు పాల్గొన్నారు.





మియాపూర్‌ కృషినగర్‌ వద్ద అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారి

అసంపూర్తి పనులు.. పూర్తయ్యేదెన్నడు..?

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నెలలు గడిచినా పూర్తి కాని సీసీ రోడ్డు పనులు

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని కృషినగర్‌ కాలనీ వద్ద ప్రధాన రహదారి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలల కిందట సీసీ రోడ్డు పనులు చేపట్టి కొంత భాగం వేయకుండా వదిలేశారు. సాధారణంగా ఏ పనులు చేపట్టాలన్నా అధికారులు ఎస్టిమేషన్‌ వేసి ఉన్నతాధికారులకు పంపుతారు. తర్వాత నిధులు మంజూరు, శంకుస్థాపనలు, టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తారు. సాధారణంగా సీసీ రోడ్డు పనులు సుమారు 10 నుండి 20 రోజుల వ్యవధిలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తారు. కానీ కృషినగర్‌లోని ప్రధానరోడ్డు పనులు భిన్నంగా సాగుతున్నాయి. సుమారు రూ.56 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. ఈ క్రమంలో రోడ్డు పనులు కొంత దూరం ఉండగానే నిధులు చాలలేదని ఆపివేసినట్టు సమాచారం. దీంతో మిగతా రోడ్డు గుంతలు, కంకర తేలి దర్శనమిస్తోంది. ఇక వాహనాల రాకపోకల్లో దుమ్ము, ధూళి రేగుతుండడంతో ప్రజలు అవస్థపడుతున్నారు. గతంలో ఈ సీసీ రోడ్డు పనులు సుమారు నెల రోజుల పాటు సాగాయి. ఈ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు పనుల జాప్యంతో అవస్థలుపడ్డారు. ఇక మిగిలి ఉన్న రోడ్డు పనులు మొదలైతే మరలా రోజుల తరబడి ఈ రోడ్డు వెంబడి వాహనదారులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. అధికారుల అనాలోచిత పనులతో ఇక్కట్లపాల వుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మియాపూర్‌ బీకే ఎన్‌క్లేవ్‌ వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు

- మియాపూర్‌ కృషినగర్‌ ప్రధాన రహదారి సీసీ రోడ్డు కొంతదూరం అసంపూర్తిగా మిగిలిపోయింది. మిగిలిపోయిన సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు గత నెల సుమారు రూ.20 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరై శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు.
- మియాపూర్‌ బీకే ఎన్‌క్లేవ్‌ కాలనీలో బొల్లారం రోడ్డు నుండి ప్రజాషెల్టర్‌ వరకు సీసీ రోడ్డు పనులకు గత రెండు నెలల కిందట ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం కాంట్రాక్టర్‌ రోడ్డును తవ్వి వదిలేశారు. నెల రోజులు దాటుతున్నా సీసీ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి.. 6 వినతులు



శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో ఉపకమిషనర్‌ మోహన్‌ రెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 వినతిపత్రాలు అందగా రెండు టౌన్‌ప్లానింగ్‌, నాలుగు రెవెన్యూ విభాగాలకు సంబంధించినవి వచ్చాయి. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని చెప్పారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం డిప్యూటి కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందాయి. ఎలక్ట్రికల్‌ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్‌కుమార్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ సర్కిల్‌ మేనేజర్‌ యూసుఫ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోల్‌బాల్‌ టోర్నీలో తెలంగాణ జట్టుకు కాంస్యం

జట్టులో హెచ్‌సీయూ విద్యార్థి లక్కీమిరానీ (దివ్యాంగుడు)



రాయదుర్గం: దృష్టిలోపం ఉన్న అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన గోల్‌బాల్‌ చాంపియన్‌షిప్‌లో హెచ్‌సీయూ పీజీ విద్యార్థి లక్కీమిరానీ జట్టు కాంస్యపతకం సాధించింది. లక్కీ మిరానీ ఇంటిగ్రేటెడ్‌ పోస్టుగాడ్యుయేషన్‌లో పొలిటికల్‌ సైన్స్‌ చదువుతున్నాడు. ఇటీవల మహారాష్ట్రలోని గోండియాలో 4వ గోల్‌బాల్‌ జాతీయ చాంపియన్‌షిప్‌ పోటీల్లో తెలంగాణ జట్టులో లక్కీ మిరానీ ఉన్నారు. దేశవ్యాప్తంగా ఈ పోటీలలో మొత్తం 17 జట్లు పోటీపడ్డాయి. అందులో తెలంగాణ జట్టుకు మూడవ స్థానం లభించింది. ఈ సందర్భంగా లక్కీ మిరానీని పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధి నిజాంపేట్‌ రోడ్డులోని సెవెన్‌హిల్స్‌ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం వేంకటేశ్వర స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌, ఆలయ ఈఓ సత్యనారాయణ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, కెఆర్‌కే రాజు, పోతుల రాజేందర్‌, శ్రీహరి, పద్మ, సాంబశివారెడ్డి, అప్పిరెడ్డి, కిరణ్‌కుమార్‌, కడియాల శివ, సుజాత, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మార్పీఎస్‌ మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి

మణికొండ: 'లక్షల డప్పులు.. వేల గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ గండిపేట్‌ మండల ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ మాట్లాడుతూ... ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు.. వేల గొంతులు' మహా ప్రదర్శన ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేడ్కర్‌ విగ్రహం వరకు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ డప్పు తీసుకొని ప్రతి మాదిగ బిడ్డ, ఉపకులాల వారు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎన్నికల్లో మాదిగ ఉపకులాల సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్‌ మాదిగ, నాయకులు పెద్దపల్లి శంకర్‌మాదిగ, రవికుమార్‌మాదిగ, అధికారప్రతినిధి ఉపేందర్‌మాదిగ, కిరణ్‌మాదిగ, రంజిత్‌మాదిగ, టిట్టు మాదిగ, యాదవ్‌రావుమాదిగ, రోహన్‌ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

ఏజీవర్సిటీ: న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సంచాలకుడిగా నియమితులైన వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, నార్మ్‌ మాజీ సంచాలకుడు డాక్టర్‌ సి.హెచ్‌.శ్రీనివాస్‌రావును భారత, మృత్తిక శాస్త్ర సంఘం ఘనంగా సన్మానించింది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ డాక్టర్‌ సి.హెచ్‌.విద్యాసాగర్‌ నేతృత్వంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... తాను విద్యనభ్యసించిన బాపట్ల వ్యవసాయ కళాశాల అలాగే నార్మ్‌లో చాలా నేర్చుకున్నానని తెలిపారు. నిరంతర కృషి, పట్టుదల, సరైన లక్ష్యంతో ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. అందుబాటుతో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకొని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మృత్తిక శాస్త్ర విభాగం అధికారులు పాల్గొన్నారు.

కాలనీల్లో పార్కుల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలోని కాలనీలలో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్‌ బి.పుష్ప అన్నారు. సోమవారం డివిజన్‌ పరిధిలోని కాకతీయనగర్‌ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకతీయనగర్‌ కాలనీలో థీమ్‌ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సంబంధిత అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు వివరించారు. థీమ్‌ పార్కులో పచ్చని మొక్కలు, వాకింగ్‌ట్రాక్‌, ఓపెన్‌ జిమ్‌, యోగా వేదిక, చిన్నారుల ఆటవస్తువులు, క్రికెట్‌ తదితరాలు ఆడుకునే విధంగా డిజైన్‌ చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కాలనీవాసులు నరేందర్‌బాబు, ప్రభాకర్‌ రెడ్డి, రాములు, శేఖర్‌ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆర్డీఓ

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ది నెస్ట్‌ వృద్ధాశ్రమాన్ని ఆర్డీఓ రవీందర్‌ రెడ్డి సోమవారం సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులతో ముఖాముఖి మాట్లాడారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు.

బీఆర్‌ఎస్‌ కృషితో ఎస్‌టీపీ ప్లాంట్‌కు నిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ పాలకవర్గం కృషితోనే తెల్లాపూర్‌లో రూ.60కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్‌ నిర్మాణానికి ఆమోదం లభించిందని తెల్లాపూర్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు దేవేందర్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ మాజీ కౌన్సిలర్లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2021లో అధికార పార్టీలో ఉన్న మాజీ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లలిత ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్‌టీపీ ఏర్పాటు కోసం కోర్టును ఆశ్రయించిందన్నారు. దాని ఫలితంగానే ఎస్‌టీపీ ప్లాంట్‌ నిర్మాణానికి నిధులు వచ్చాయని తెలిపారు. గతంలోనే ప్లాంట్‌ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని కూడా చూశారు. కాంగ్రెస్‌, బీజేపీల వల్ల ఎస్‌టీపీ ప్లాంట్‌ నిర్మాణానికి నిధులు రాలేదని వివరించారు.

రంగనాథస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంత సమీపంలోని రంగనాథస్వామి ఆలయ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను శ్రీరంగనాథ్‌ మందిర్‌ రంగ్‌భాగ్‌ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్‌ శరద్‌ బి పిట్టి, నిర్వాహణాధికారి కె అంజయ్య పర్యవేక్షణలో జరుగుతాయి. రోజు ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 10 గంటలకు అర్చన, 12 గంటలకు బలిహరణ సాయంత్రం ఆరాధన, సాముహిక విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి 7 గంటలకు పల్లకి సేవ, నీరాజనం వంటి పూజలు విధిగా జరుగుతాయి. మంగళవారం అంకురార్పణతో ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. బుధవారం ధ్వజారోహణం, భేరిపూజ, దేవతా ఆవాహనం, 6వతేదీ లక్ష్మీదేవికి అభిషేకం, 8వ తేదీన రంగనాథస్వామి అభిషేకం, రాత్రి కల్యాణోత్సవం, ఊంజలసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 9వ తేదీ అమ్మవారికి కుంకుమార్చన, 10వతేదీ రంగనాథస్వామికి అభిషేకం, రాత్రి స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చివరిరోజు పూర్ణాహుతి, చక్రతీర్థం, వసంతోత్సవం, ద్వాదశ ఆరాధన, దేవతా విసర్జనం, ధ్వజారోహణం, భేరి పూజ, సప్తవర్ణ పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వసంత పంచమి వేడుకలు

శేరిలింగంపల్లి/రాయదుర్గం: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. శేరిలింగంపల్లి డోయన్స్‌కాలనీలోని విద్యాంజలి పాఠశాలలో సరస్వతీదేవి పూజ చేశారు. హాల్‌టికెట్లు, పెన్నులు, పెన్సిళ్లను పూజలో ఉంచి అనంతరం విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు యూనిఫారమ్‌, పలకలు పంపిణీ చేశారు.



నాగార్జున ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం



విద్యాంజలి స్కూల్‌లో సరస్వతీదేవి పూజ

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణకు అధికారుల నియామకం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఉప కమిషనర్లు బండి గంగాధర్‌, వంశీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలోని 11 వార్డుల్లో 11 ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి జీహెచ్‌యంసీ వార్డు కార్యాలయం సుదర్శన్‌ కుమార్‌ : ఫోన్‌ 9959442432, బాలానగర్‌లో సునీల్‌ 7331170683, కూకట్‌పల్లిలో సాయిప్రసన్న 7995007398, వివేకానందనగర్‌లో 9849639766, హైదర్‌నగర్‌లో 9989908068, ఆల్విన్‌కాలనీలో శ్రీనివాస్‌ 9989930181, కేపీహెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో శంకర్‌ 8897507965, బాలాజీనగర్‌లో టీకే ప్రభాకర్‌ 9849907651, అల్లాపూర్‌లో కార్తీక్‌ 9154295227, మూసాపేటలో జమీలుద్దీన్‌ 9949619958, ఫతేనగర్‌ వార్డు కార్యాలయంలో మురళి 9000554761 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులతో పాటు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకతాయిల వీరంగం.. యువకుడిపై దాడి



దాడి చేస్తున్న ఆకతాయిలు

గచ్చిబౌలి: మద్యం మత్తులో ఆకతాయిలు రోడ్లపై వీరంగం చేస్తున్నారు. వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నారు. మణికొండలోని పోచమ్మబస్తీలో కొందరు యువకులు అర్ధరాత్రి దాటాక రోడ్లపై తిరుగుతూ వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఓ యువకుడిని అటకాయించి దాడికి పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హకీంపేట్‌ స్పోర్ట్‌ స్కూల్‌లో డిగ్రీ చదివే విద్యార్థి వి.నాగార్జునరెడ్డి పార్ట్‌ టైం రాపిడో బైక్‌ నడుపుతాడు. మణికొండ పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్న అతను సోమవారం తెల్లవారు జామున 2.40 గంటల సమయంలో రాపిడో రైడ్‌కు బయలుదేరాడు. బస్తీలో 12 మంది యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు నిలిపారు. వారిని చూసి నాగార్జున పక్కనుంచి వెళుతుండగా బూతులు తిట్టారు. పట్టించుకోకుండా వెళుతుండగా వెనక నుంచి బైక్‌లపై వెళ్లి కొట్టారు. భయపడి యువకుడు తిరిగి ఇంటికి రాగా అక్కడకు వచ్చిన ఆకతాయిలు మళ్లీ గొడవకు దిగారు. కుటుంబ సభ్యులు రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఓ బైక్‌ను పట్టుకొని రాయదుర్గం మొబైల్‌ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దాడికి పాల్పడిన కొందరిని గుర్తించామని ఎస్‌ఐ జగదీష్‌ తెలిపారు.

ముగిసిన బాల్‌ బ్యాడ్మింటన్‌ టోర్నీ



విజేతలతో ముఖ్య అతిథులు

విజేతగా నిలిచిన ఏఎస్‌రావు నగర్‌ జట్టు

మణికొండ: రాష్ట్ర స్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు సోమవారం మణికొండలోని అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో జరిగాయి. ఇందులో మణికొండ, ఏఎస్‌రావు నగర్‌, హన్మకొండ, బీహెచ్‌ఈఎల్‌, కేపీహెచ్‌బీ కాలనీ, గాయత్రినగర్‌, గట్టుప్పల్‌, చేవెళ్ల, కరీంనగర్‌, సంగారెడ్డి, మెదక్‌ జట్లు పాల్గొన్నాయి. పోటీలను మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయి, అత్తాపూర్‌లోని జర్మెంటిన్‌ ఆసుపత్రి జనరల్‌ మేనేజర్‌ సంతోష్‌ ఆదివారం ప్రారంభించారు. సోమవారం జరిగిన ఫైనల్‌ పోటీలలో టోర్నమెంట్‌ విజేతగా ఏఎస్‌రావు నగర్‌ కాలనీకి చెందిన మారుతి బాల్‌ బ్యాడ్మింటన్‌ జట్టు నిలిచింది. రెండవ స్థానంలో బీహెచ్‌ఈఎల్‌ సంకల్ప బాల్‌ బ్యాడ్మింటన్‌ జట్టు, మూడవ స్థానంలో హన్మకొండ, నాలుగో స్థానంలో మణికొండ జట్లు నిలిచాయి. మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా సాయికిరణ్‌, రెండవ ఆటగాడిగా శశిలు నిలిచారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సహాయ కార్యదర్శి కమల్‌, అత్తాపూర్‌ జర్మెంటిన్‌ ఆస్పత్రి చైర్మన్‌ డాక్టర్‌ జావేద్‌ జార్‌ ఖాన్‌ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడను ఎంచుకుని సాధన చేసి రాణించాలన్నారు. ఆటలతో ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా వారు విజేతలకు మొమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మణికొండ బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆనంద్‌, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు నరహరి శాస్త్రి, సీతారామరాజు, రమేష్‌, రామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజు, ఆసిమ్‌, నవీన్‌కుమార్‌, ఎ.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతగా మారుద్దాం

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్‌ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్‌ రెడ్డి తదితరులు

పటాన్‌చెరు టౌన్‌: పొగాకు రహిత యువతగా మారుద్దామని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్‌ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని భానూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌ రెడ్డి మాట్లాడుతూ... బస్టాండ్‌, మార్కెట్‌, విద్యాసంస్థల తదితర ప్రదేశాల్లో పొగాకు వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువత పొగాకు, గుట్కా, తంబాకు, జర్దా, పాన్‌ మసాలా, సిగరెట్‌కు అలవాటు పడి, క్యాన్సర్‌, గుండె జబ్బులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు వాడకలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పెంటయ్య, సుజాత, మంగ తదితరులు పాల్గొన్నారు.